## క్లుప్తంగా

### నేడు జాబ్‌మేళా

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ- సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కురాకు ఫైనాన్సియల్ సర్వీసెస్, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇంటర్, డిప్లమో(మెకానికల్), డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు యువతి, యువకులు జాబ్‌మేళాకు అర్హులుగా తెలిపారు. ఎంపికై న అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ. 29 వేల వరకు వేతనం, ఇతర సదుపాయలను కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు బయోడేటా, ఆధార్, పాన్, విద్యార్హత సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 94940 05725 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### 22న బహిరంగ వేలం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 22న చీరలు, రవికలు పోగుచేసుకునే లైసెన్స్ హక్కు నిమిత్తం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో సమర్పించే చీరలు, రవికల లైసెన్స్ కోసం, ఆలయానికి సంభందించిన షాప్-1, షాపు-2లకు కూడా వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 11 గంటలకు సీల్డ్ టెండరు, బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆశక్తిగల వారు పాల్గొనవలసిందిగా కోరారు.

### రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



ఉంగుటూరు: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సాత్విక్, స్వాతి, స్మైలీ ఎంపికైనట్లు హెచ్‌ఎం టి.సీతారామ్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం, గూడురులో నిర్వహించు రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలలో తమ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. అండర్-14 విభాగంలో కె.సాత్విక్, అండర్- 17 విభాగంలో కె.స్వాతి, ఐ.స్మైలీ పాల్గొంటారని తెలిపారు. విజేతలను, వ్యాయమ ఉపాధ్యాయిని జ్యోతిని హెచ్‌ఎం సీతారామ్, విద్యా కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ కమల భాస్కర్ అభినందించారు.

### భక్తిశ్రద్ధలతో లక్ష తులసి పూజ




ఉయ్యూరు: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని గండిగుంట దత్త దేవాలయంలో భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ పూజ ఆదివారం నిర్వహించారు. అనఘా సమేత దత్త దిగంబర స్వామికి వేదమంత్రాలతో అర్చకులు లోక కల్యాణార్థం గోపూజ, హోమాలు జరిపించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మూడు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

### ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం



పెనమలూరు: వరదల సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన కానూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ లయన్ శ్రీరామ్‌పవన్‌కు ఉత్తమ సేవా అవార్డు వచ్చింది. యాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాన్ ఇండియా అవార్డ్స్-2024 హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభకనబర్చిన వారికి సేవా పుస్కారాలు ఇచ్చారు. బుడమేరు వరద సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ లయన్ శ్రీరామ్‌పవన్‌కు జాతీయ స్థాయిలో నెహ్రూ పురస్కారం లభించింది.

### జాతీయ రహదారిపై ఆటో బోల్తా



కంకిపాడు: జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడ్డ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ- మచిలీపట్నం జాతీయరహదారిపై నెప్పల్లి మసీదు సెంటరు సమీపంలో కంకిపాడు వైపు వస్తున్న ఆటోను గుర్తుతెలియని వాహనం వెనుకగా ఢీకొంది. దీంతో ఆటో పల్టీ కొట్టింది. సమాచారం అందుకున్న హైవే అంబులెన్సు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను వైద్యంనిమిత్తం తరలించింది. అయితే ప్రమాదానికి కారణమైన వాహనం, క్షతగాత్రులు ఎవరు?, ఏ గ్రామం అన్నది తెలియలేదు. ఎస్‌ఐ డి.సందీప్ మాట్లాడుతూ ఆటో బోల్తా ఘటనపై వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

# ప్రజారోగ్యానికి ముప్పు

- ఖాళీస్థలాల్లో మురుగు నీరు నిల్వ
- దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- పొంచి ఉన్న వ్యాధుల భయం



కంకిపాడు బ్యాంకు కాలనీలో ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు



కంకిపాడులో ఓ రియల్ ఎస్టేట్ వెంచరులో చెరువులా ఖాళీ స్థలం

కంకిపాడు: ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పిచ్చి మొక్కలతో నిండిపోయి, విష కీటకాలకు ఆవాసంగా ఖాళీస్థలాలు మారటమే ఇందుకు కారణం అవుతోంది. ఏ గ్రామంలో చూసినా ఇదే సమస్య. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు ఖాళీస్థలాల వెంబడి నివాసితులు వ్యాధులు భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### మురుగు.. పిచ్చి మొక్కలతో..

మండల కేంద్రమైన కంకిపాడు సహా అనేక గ్రామాల్లో ఖాళీ స్థలాల సమస్య అధికంగా ఉంది. రియల్ వెంచర్లలోనూ స్థలాలు కొనుగోలు చేసి ఎలాంటి మెరకలు చేయకుండా యజమానులు వదిలేసి ఉంచారు. దీంతో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తున్నాయి. పాములు, విష కీటకాలకు ఆవాసంగా తయారయ్యాయి. రాత్రిళ్లు ఆ స్థలాల వెంబడి ఉన్న రహదారుల నుంచి రాకపోకలు సాగించలేని దుస్థితి. ఎప్పుడు ఎలాంటి విష కీటకం బారిన పడాల్సి వస్తుందోనన్న భయంతో ఇక్కడి ప్రజలు రోజులు వెళ్లదీస్తున్నారు.

### దోమల ఉత్పత్తి కేంద్రాలుగా..

ఖాళీ స్థలాలు చాలా వరకూ పల్లంగా ఉన్నాయి. స్థల యజమానులు మెరక చేయకుండా వదిలేస్తున్నారు. దీంతో అడపా దడపా కురుస్తున్న వర్షాలకు ఖాళీస్థలాల్లో వర్షం నీరు చేరుతోంది. దీనికి తోడు స్థానికులు వినియోగించే వ్యర్థ నీరు సైతం ఖాళీస్థలాలను ముంచెత్తుతోంది. రోజుల తరబడి నీరు కదలక తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దోమలు విజృంభించి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కంకిపాడులో ఖాళీస్థలాల సమస్య అధికంగా ఉంది. ఖాళీస్థలాల్లో కంప తొలగింపు, మెరక పనులు చేసేలా యజమానులకు అధికారులు నోటీసులు ఇచ్చి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఖాళీ స్థలాలతో సమస్య..



ప్రతి గ్రామంలోనూ ఖాళీ స్థలాల సమస్య ఉంది. మురుగు నీటి చెరువులను తలపిస్తున్నాయి. దోమలు వ్యాప్తి చెందేందుకు ఆస్కారం అవుతున్నాయి. మురుగు నుంచి వెలువడే దుర్గంధం భరించలేని పరిస్థితి. ప్రతి నిత్యం కంకిపాడు పరిసర గ్రామాలకు వెళ్తుంటాం. ఎక్కడ చూసినా ఇదే సమస్య. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – నర్రా రమేష్, నెప్పల్లి

### ప్రజారోగ్యానికి భద్రత కల్పించాలి..



మురుగు, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలకు వ్యాధులు భయం పొంచి ఉంది. వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామాలకు వెళతాం. ఖాళీస్థలాల్లో పాములు, విష పురుగులు కనిపిస్తుంటాయి. దోమలు అంటే చెప్పనక్కర్లేదు. ప్రజల ఆరోగ్యం దెబ్బతినక ముందే అధికారులు స్పందించాలి.
– జె.రవి, జగన్నాథపురం

# సామూహిక సత్యనారాయణ వ్రతాలు



శ్రీసత్యనారాయణ స్వామి పటం వద్ద పూజలు



సామూహిక సత్యనారాయణ వ్రతంలో దంపతులు

నున్న(విజయవాడరూరల్): శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానం చినకంచిలో కార్తిక మాసం మూడో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు వైభవంగా జరిగాయి. తొలుత కార్తిక వనసమారాధనోత్సవం అనంతరం భక్తులు సత్యనారాయణ వ్రతంలో పాల్గొని విశేష పూజలు చేశారు. విజయవాడ, పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్నారు. గుంటూరు లక్ష్మీనారాయణ, సోమయాజులు సత్యనారాయణ వ్రతం చేయగా, పెద్దిభొట్ల ఉమామహేశ్వరమ్ పర్యవేక్షించారు. గత 12 సంవత్సరాలుగా సామూహిక ఉచిత సత్యనారాయణ వ్రతాలను కార్తిక మాసం మూడో ఆదివారంలో నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలియజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

పెనమలూరు: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చోడవరం గ్రామంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. చోడవరం శ్రీ లక్ష్మీనారాయణ సహిత శ్రీనాగేంద్రస్వా ఆలయం ప్రాంగణంలో పూజలు చేశారు. సామూహిక శ్రీరమా సహిత శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఉసిరి చెట్టు, స్వామివారి ఆలయంలో పుట్ట వద్ద దీపారాధన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం 800 మందికి వనసమారాధన కార్యక్రమంలో భాగంగా భోజనం పెట్టారు. ఈ కార్యక్రమంలో అర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు బుద్ద లక్ష్మణకుమార్, ప్రధాన కార్యదర్శి తటపక్లి సతీష్, కోశాధికారి తాతా వెంకటకిషోర్, సంఘ సభ్యులు కొండేటి బాబూరావు, యినుగూరి సుబ్రహ్మణ్యం, చక్క లక్ష్మణరాయుడు, పరుచూరి రఘు, కొప్పవరపు సత్యనారాయణ, పలువురు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా వన సమారాధన



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో కార్తిక మాస వన సమారాధన ఆదివారం ఉత్సహంగా జరిగింది. గ్రామానికి చెందిన కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలు తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భగవద్గీత పారాయణం చేసి గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతునికి ప్రార్థనలు చేశారు. గ్రామంలోని కాపు సామాజిక వర్గీయులు కుటుంబ సమేతంగా వనసమారాధనకు హాజరయ్యారు. పచ్చని చెట్ల మధ్య మహిళలు, చిన్నారులు ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. సంఘ సభ్యులు కోడెబోయిన బాబి, బుగ్గ శివ, ఆత్మూరి బాలాజీ, తోట సుధీర్, వల్లూరి రాము, జక్కుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ వలంటీర్ల సేవలు ఆదర్శనీయం



గన్నవరంలో శ్రమదానం చేస్తున్న రెడ్ వలంటీర్లు

గన్నవరం: సుందరయ్య రెడ్ వలంటీర్లు చేస్తున్న సామాజిక సేవలు ఆదర్శనీయమని ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు తెలిపారు. స్థానిక బుద్దవరం రోడ్డులో ఆదివారం సుందరయ్య రెడ్ వలంటీర్ల ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించారు. మురుగునీటి కాలువల్లో పూడికలు తీసి శుభ్రం చేశారు. తొలుత శ్రమదానాన్ని ప్రారంభించిన గన్నె మాట్లాడుతూ.. యువకులు సంఘాలుగా ఏర్పాడి సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. రెడ్ వలంటీర్లు చేస్తున్న సేవలకు తమవంతు సహకారం అందిస్తామని రెడ్‌క్రాస్ కార్యదర్శి చిన్ని మాధవి తెలిపారు. రెడ్ వలంటీర్లు ఎం ఎస్.బ్రహ్మాచారి, మల్లంపల్లి ఆంజనేయులు, కళ్లం కోటయ్య, మిరప నాగేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, బీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చెస్ పోటీల్లో విజేతలకు అభినందన



చెస్‌పోటీల్లో గెలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

పెనమలూరు: జేఎన్‌టీయుకే ఇంటర్‌కాలేజీ చెస్‌పోటీల్లో కానూరు వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారు. ఈ మేరకు కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పోతిన రఘు ఆదివారం వివరాలు తెలిపారు. ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడ పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కాలేజీలో ఇంటర్‌కాలేజీ చెస్ పోటీలు నిర్వహించారన్నారు. తమ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి ద్వితీయ స్థానం గెలిచారని వివరించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

# అధికార పార్టీలో 'చెత్త' రాజకీయం



కోనాయి చెరువు వద్ద పేరుకుపోయిన చెత్త నిల్వలు

గన్నవరం: మేజర్ గ్రామ పంచాయతీ గన్నవరంలో చెత్త చుట్టూ రాజకీయాలు నడుస్తున్నాయి. స్థానిక కోనాయి చెరువు వద్ద పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించే కాంట్రాక్ట్‌ను దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలు పోటీపడుతున్నారు. వివరాలీలా వున్నాయి.

### విషయం ఇదీ..

గన్నవరం, కేసరపల్లి, బుద్దవరం గ్రామాల్లో చెత్త దంపింగ్ సమస్య పరిష్కారం కోసం ఉమ్మడి నిధులతో చెత్త సేకరణ వాహనాన్ని కొనుగోలు చేశారు. ఈ వాహనం ద్వారా మూడు గ్రామాల్లో రోజువారీ సేకరించిన చెత్తను గుంటూరులోని జిందాల్ పవర్ ఉత్పత్తి కంపెనీకి తరలిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు కోనాయి చెరువు వద్ద డంప్ చేసిన చెత్తతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. దీంతో అక్కడ చెత్తను పూర్తిగా తొలగించి మొక్కలు నాటడడం ద్వారా పచ్చదానాన్ని పెంపొందించే ప్రణాళికను గ్రామ పంచాయతీ చేపట్టింది.

### ఉదయం అనుమతి.. సాయంత్రం రద్దు..

ఇప్పటికే ఓ నాయకుడికి ఉదయం చెత్త తరలింపు కాంట్రాక్ట్ ఇచ్చి సాయంత్రానికి నిలిపివేశారు. ఈ పనులను వేరొకరికి కేటాయించే అవకాశం ఉండడంతో టీడీపీలోని రెండు వర్గాలు కాంట్రాక్ట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

### మద్యం దరఖాస్తు విషయంలో అలా.. చెత్త విషయంలో ఇలా..

అయితే ఈ చెత్తను తొలగించేందుకు గత నెల గ్రామపంచాయతీ పాలకవర్గం అత్యవసర సమావేశం నిర్వహించి టీడీపీలో ఓ వర్గం సిఫార్సు మేరకు కేసరపల్లికి చెందిన టీడీపీ నేతకు కాంట్రాక్ట్ కేటాయించారు. అదే రోజు పనులు కూడా ప్రారంభించి చెత్తను గొల్లనపల్లి శివారుకు టిప్పర్లలో తరలించారు. అయితే సదరు కాంట్రాక్ట్ పొందిన నాయకుడు ఇటీవల మద్యం దరఖాస్తుల విషయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. దీంతో సాయంత్రానికి ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చెత్త తరలింపు పనులు నిలిపివేశారు.

### వర్గాల మధ్య పోరు..

దీంతో చెత్త తరలింపు కాంట్రాక్ట్‌ను దక్కించుకునేందుకు టీడీపీలోని రెండో వర్గం ప్రయత్నాలు ప్రారంభించింది. మొదట మరో కాంట్రాక్టర్‌ను సూచించిన రెండో వర్గానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు తాజాగా చెత్త తరలింపు పనులను తనకే అప్పగించాలని గట్టిగా పట్టుపడుతున్నారు. మధ్యే మార్గంగా తాము సూచించిన మరో వ్యక్తికి కాంట్రాక్ట్ అప్పగించాలని పోటీ వర్గం ప్రయత్నాలు తీవ్రతరం చేసింది.

### నిలిచిపోయిన చెత్త తరలింపు..

నేతల మధ్య నెలకొన్న అధిపత్య పోరు కారణంగా గత పదిహేను రోజులుగా చెత్త తరలింపు ప్రక్రియ నిలిచిపోయింది. అయితే గతంలో కంటే ఎక్కువ మొత్తంలో చెత్త తరలింపు పనుల అంచనాలు పెంచడంతో అధిక లాభాలు వస్తాయనే ఆలోచనతో అధికార పార్టీ నేతలు కాంట్రాక్ట్ దక్కించుకునేందుకు పోటీలు పడుతున్నట్లు తెలుస్తోంది.

# విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న శాయోజీరావు



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో..



వీరవల్లి గ్రంథాలయంలో..



వణుకూరులో మ్యూజికల్‌చైర్స్ పోటీల్లో విద్యార్థులు



ముదునూరు గ్రంథాలయంలో చిన్నారులు



తెన్నేరు జెడ్పీ పాఠశాలలో కుర్చీలాట

గన్నవరం: విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవార్చుకోవాలని విశ్రాంత అధ్యాపకులు శాయోజీరాజు సూచించారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలోగ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవి సమ్మేళనాలు, రచయితల సందేశాల కార్యక్రమాలు నిర్వహించారు. శాయోజీరావు మాట్లాడుతూ.. పుస్తక పఠనం వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, మానసిక స్థైర్యం పెరుగుతుందన్నారు. అమూల్యమైన పుస్తక సంపదను విద్యార్థులు సద్వినియోగిం చుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు తెలిపారు. విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, కమిటీ సభ్యులు చిమట రామారావు, గ్రంథాలయ ఇన్‌చార్జి పీడీ లక్ష్మి పాల్గొన్నారు.

పెనమలూరు: వణుకూరు గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పలు పోటీలు జరిగాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి భారతి పాల్గొన్నారు. పెనమలూరు శాఖ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.హరీష పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: తెలుగు వైభవానికి బాటలు వేసిన కవులను ఎల్లప్పుడూ స్మరించాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. ఆదివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మన తెలుగు కవులు అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, తాడు ఆటలు ఆడించి విజేతలను ఎంపిక చేశారు. పాఠకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉయ్యూరు, ముదునూరు గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. ముదునూరు గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి నాగరాజు పోటీలను పర్యవేక్షించారు. ఉయ్యూరు గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షించారు.

కంకిపాడు: ఆట పాటలతో మానసిక వికాసం కలుగుతుందని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తెన్నేరు జెడ్పీ పాఠశాల, ఎంపీఎంపీ పాఠశాల, చరిత స్కూల్స్‌లో ఆదివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు. బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు జరిపించారు. సునీత మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి ఆసక్తి గల క్రీడల్లో ప్రావిణ్యం సాధించాలని సూచించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రంథాలయ వారోత్సవాలను మండలంలోని వీరవల్లి, కానుమోలు, బాపులపాడు శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయటంతో పాటుగా విద్యార్థులకు వ్యాస రచన, చెస్, క్యారమ్స్, డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు జె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిన్నరాజు, స్వర్ణలతాదేవి పాల్గొన్నారు.

# వ్యానులో నగదు, సెల్‌ఫోన్ అపహరణ

గన్నవరం: రోడ్డు పక్కన ఆగివున్న వ్యాన్‌లో నగదు, సెల్‌ఫోన్‌ను దొంగలు అపహరించుకుపోయిన సంఘటన మండలంలోని కేసరపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం..రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కుడిపూడి రామకృష్ణ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరు నుంచి కొబ్బరికాయల లోడుతో తెల్లవారుజామున విజయవాడకు బయలుదేరాడు. కేసరపల్లి ఏలూరు కాలువ వద్ద వ్యాన్‌ను రోడ్డు పక్కన పార్కింగ్ చేసి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఈ సమయంలో స్కూటీపై వచ్చిన ఇరువురు యువకులు వ్యాన్‌లో రూ.80 వేల నగదు, కీప్యాడ్ సెల్‌ఫోన్‌ను అపహరించారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన రామకృష్ణపై దాడిచేసి పరారయ్యారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

### 24న 'వాకర్స్' కార్తిక వనసమారాధన

గన్నవరం: వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీనివాస హేచరీస్ ఎదురుగా ఉన్న పామాయిల్ తోటలో వన సమారాధన జరుగుతుందన్నారు. ఆటపాటలతో పాటు కార్తిక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాకర్స్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

### జాతీయ రహదారిపై కారు దగ్ధం





కారు నుంచి ఎగసిపడుతున్న మంటలు, కాలిపోయిన కారు

హనుమాన్‌జంక్షన్ రూరల్: 216 హెచ్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం ఆరుగొలను వద్ద ఆదివారం రాత్రి ఆకస్మాత్తుగా కారులో మంటలు చేలరేగాయి. దీంతో భయాందోళనకు గురైన కారులోని ఇద్దరు వ్యక్తులు బయటకు దిగి పరుగులు పెట్టారు. గుడివాడకు చెందిన జాస్తి శిరీష కుటుంబ సభ్యులు ఏలూరు వెళ్లుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించటంతో క్షణాల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంపై స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రహదారిపై కారులో మంటలు చేలరేగటంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు తీవ్ర ఆటంకం ఏర్పడింది.